# నాకూ వయసొచ్చింది

— పి. శేషుకుమారి

ఆరోజు నాకేదో వెలితిగా వున్నట్టని పించింది. కుమ్మరి పురుగులా నా మనసును దొలిచేస్తోందా కోరిక. నాకు ఎప్పుడూ వున్న అలవాటే. ఏదైనా అనుకున్నానంటే జరిగి తీరాల్సిందే. అయ్యేవరకూ నిద్రపట్టదు.

నా ఆలోచనలకు బ్రేక్ వేస్తూ ఎదురింటి తలుపు తెరుచుకుంది. ఆమె గుమ్మం దగ్గర తళుక్కున మెరిసింది.

కళ్యాణి!

అసలు ఆమెని చూసీసరికే నాలో ఆ కోరిక బలపడింది.

ఆ పాతకాలం ఇంట్లోకి వాళ్ళొచ్చి మూడు నెలలవుతోంది. రోజూ నాలుగైదుసార్లు కన బడుతూంటుంది. నా కళ్ళముందలా ఆమె కావాలనే తిరుగుతున్నట్టనిపిస్తుంది. మధ్య మధ్యలో ఆ నల్లటి బ్లాక్ పాలిష్ చేపల్లాటి కళ్ళను నాకేసి తిప్పుతూంటుంది. ఎర్రటి గులాబిరేకుల్లాంటి చెక్కిళ్ళు. నునుపెక్కిన బుగ్గలు. ముద్దొచ్చే ముక్కు. తడి ఆరిపోతున్న పలుచని పెదాలు. మంచుకురవడంతో విచ్చు కున్న ముద్ద మందారంలాటి ముఖారవిందం. ఓహ్..... ఒక మహాశిల్పిచేత్తో మలిచిన కుందనపు బొమ్మలా వుంటుంది.

నాకామెతో తొలి పరిచయం గుర్తుకొస్తేనే సుందర స్వప్నాల్లోకి తేలిపోతాను. చాలా గమ్మత్తుగా జరిగింది మా పరిచయం.

సాయంత్రం ఆరవుతోంది. కాలేజీనుంచి యింటికి వచ్చాను. వచ్చేసరికి ఇంటికీతాళం వేసుంది. సాధారణంగా సాయంత్రంపూట అమ్మ బజారుకు వెళ్తుంది. నేను వస్తానని తెలిసికూడా వెళ్ళిందంటే ఎవరికేనా తాళం ఇచ్చి వెళ్ళివుంటుందని వూహించుకుని యెదురింటివేపు నడిచాను.

ఎదురింటివేపే ఎందుకు వెళ్ళానంటే అమ్మకి, ఎదురింటావిడకు అప్పుడే పరిచయ మైంది. యెప్పుడైనా లేటుగావస్తే వాళ్ళింటో అడిగి కీ తీసుకోమంది.

కొంచెం బెరుకుగావుంది. అదేమొదటిసారి. ఆమెతో అసలు పరిచయంలేదు. తలుపుదగ్గరికి వేసి వుండటంతో తోసుకుని లోపలికి వెళ్ళాను.

"ఎవరూ?" ఆమె గొంతు లోపలి గది లోంచి వినిపించింది.

"నేను" అన్నాను బిడియపడుతూనే.

"వస్తున్నా... ఒక్క నిముషం" అందామె.

ఇంట్లో ఎవరూలేనట్టున్నారు. చుట్టూ చూసాను. గదంతా చక్కగా అలంకరించబడి వుంది. గదికి మధ్యగా మూడు కుర్చీలు. టీపాయ్. ఓ పక్కగా సోఫా సెట్టూ. గోడలకి అందమైన పెయింటింగులు తగిలించబడి వున్నాయి.

ప్రక్కగది తలుపులు తెరిచే వున్నాయి.

ఆమె డ్రెస్సింగ్ మిర్రర్ ముందు నిలబడి, రెండు చేతులు వెనక్కి పెట్టుకుని తెల్లటి బ్రా హుక్స్ పెటుకుంటోంది.

జివ్వు మన్నాయి నా నరాలు.

పనస తొనలాంటి వీపు. పాల నురుగులా తెల్లటి పొట్ట. అప్పుడే స్నానంచేసి బట్టలు కట్టుకుంటున్నట్టుంది.

ఎందుకో ఆమెనలా చూస్తూంటే నాలో ఏదో చెప్పలేని అనుభూతి. నా చూపులు ఆమె కట్టుకుంటున్న తెల్లటి బ్రా పైనే వున్నాయి. నాకెంతో ఆనందంగా వుంది. టెన్షన్‌తో చూస్తున్న నాకు ఆమె జాకెట్టు వేసేసుకోవ డంతో నిరుత్సాహమే ఎదురైంది. ఆమె చీర కట్టుకుని వచ్చేసరికి డీలాపడిపోయి వున్నాను.

"ఏమిటి?" అడిగిందామె నాకేసి సూటిగా చూస్తూ.

"తాళం!" అడిగాను

"ఓ సారీ! మర్చిపోయాను" అంటూ తెచ్చి యిస్తూ, "అన్నట్టు నీ పేరేంటి?" అడిగిందామె.

"సుధ" ఆమె నా పేరడిగేసరికి నాకెంతో సరదావేసింది. మర్నాటినుండి ఆమెతో మాటా డొచ్చుకదా... ఐ మీన్ స్నేహంచెయ్యొచ్చుగా.

"మీ పేరు?"

"కళ్యాణి"

"ఏం చదువుతున్నావు?" అడిగిందామె.

"బియస్సీ ఫస్టియర్" ఆమె కట్టుకున్న చీర కుచ్చిళ్ళ కేసి చూస్తూ చెప్పాను. తర్వాతేం మాటాడాలో తెలీక నావైపు చూస్తున్న ఆమెను నేనే అడిగాను.

"ఇంట్లో ఎవరూ లేరా?"

"అమ్మా నాన్న సినిమాకెళ్ళారు" ముక్త సరిగా జవాబిచ్చింది

**అనసూయమ్మగారికి మాధవరావుగారికి కళ్యాణి ఒక్కతే సంతానం అస్థులుపాస్థులు బాగా వున్నవాళ్ళే. కళ్యాణి పుట్టకముందు వాళ్ళ బంధువుల అబ్బాయిని పెంచుకున్నారట. అతడిప్పుడు హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నాడు. అనసూయమ్మగారు కలుపుగోలు మనిషి**

"అయ్యో! మీరేం వెళ్ళలేదూ?" అప్పుడే కలివిడిగా మాట్లాడేను.

"తలనొప్పిగా వుందని"

"అయితే నేనుకూడా మీకు తలనొప్పి తెచ్చేలా వున్నాను.... వస్తాను" అనేసి వచ్చేసాను. ఆమె పకపకా నవ్వింది.

ఆ తర్వాత్తరువాత కలిసి షాపింగుకు, సిన్మాలకు వెళ్ళేవాళ్ళం. ఇప్పటికీ వెళ్తున్నాం. అనసూయమ్మగారికి మాధవరావుగారికీ కళ్యాణి ఒక్కతే సంతానం. ఆస్తులుపాస్తులు బాగా వున్నవాళ్ళే. కళ్యాణి పుట్టకముందు వాళ్ళ బంధువుల అబ్బాయినొకడిని పెంచుకున్నారట. అతిడిప్పుడు హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నాడు. అనసూయమ్మగారు చాలా కలుపుగోరు మనిషి. కళ్యాణి తల్లినుంచే చలాకీ మాటకారితనం పుణికిపుచ్చుకుంది. అయినా గమ్మత్తైన విషయమేంటంటే వాళ్ళొచ్చి నెలైనా, ఇప్పటివరకూ మాకు మాటలు కలవలేదు. చాలాసార్లు ఆమె బ్రాకట్టుకుంటూంటే దొంగతనంగా చూసేదాన్ని. ఓ మారు దొరికిపోయాను.

"ఛీ! సిగ్గులేదూ" అందామె నవ్వుతూ. వెక్కిరించి పారిపోయేను.-అంత సన్నిహితులమయ్యామన్నమాట. బహుశా ఆమెకి నా కోరిక తెలిసిపోయి వుంటుంది.

"సుధా! కాలేజికి టైమయ్యిందే" అన్న అమ్మ కేకకు ఈ లోకంలోపడ్డాను. కళ్యాణి లోపలికి వెళ్ళిపోయి చాలాసేపయ్యేవుంటుంది. ఎదురుగా చూస్తేలేదు.

రేపు నా పుట్టినరోజు. అమ్మకి నా కోరిక చెప్పాలంటే భయంగావుంది. దీన్ని భయం అనేకంటే సిగ్గు. బిడియం అంటే బావుంటుంది.

సాయంత్రం కాలేజినుండి ఇంటికి వచ్చేసరికి అమ్మతో కబుర్లాడుతోంది కళ్యాణి. నన్ను చూడగానే, "హేపీ బర్త్‌డేకి అడ్వాన్స్ గ్రీటింగ్" అంది.

"థాంక్స్! అప్పుడే అమ్మ చెప్పేసిందన్నమాట. రేపు పార్టీకి రావాలిసుమా" బుంగమూతిపెట్టి అన్నాను. కొంతసేపుండి ఆమె వెళ్ళిపోయింది.

అమ్మతో చెప్పాలనుకున్నాను కానీ. చెప్పలేకపోతున్నాను. నిజమే కొనిపెట్టమని అడగటానికి అడిగేమన్నా అటవస్తువా? నాకూ వయసొచ్చింది. వయసుతోబాటు శరీరంలో కూడా మార్పులొస్తాయి. పెద్దవాళ్ళకి ఈ మాత్రం ఇంగితజ్ఞానం ఎందుకుండదు? పిల్లలకినీసావసరాలేంటో కూడా తెలీని తల్లిదండ్రులుంటారా? సగం రాత్రివరకూ ఇలా ఆలోచిస్తూనే పక్కమీద పొర్లాను.

మర్నాడు తలారా స్నానంచేసి బట్టలు కట్టుకుని హాల్లోకి వచ్చేసరికి సోఫాలో కూర్చొని వుంది కళ్యాణి.

"హేపీ బర్త్‌డేటూయూ. మెనీమెనీ హేపీ రిటర్న్స్ టుయూ" అని చేతిలోని పాకెట్టుని నాకందించింది.

థాంక్స్ చెప్పి అమ్మ చేసిన స్వీటు, హాటు పెట్టాను

ఆమె ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ నాకేసి చూసింది. పాకెట్ విప్పాను. ఆనందంతో నా ఒళ్ళు పులకరించిపోయింది.

తెల్లగా, పాలపొంగులా ...

క్రొత్త బ్రాసరీ!

ఆమె నావేపు కొంటెగా చూసింది. వెంటనే ఆమె చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నాను.

సిగ్గుతో తలవంచుకుని "సోమచ్ థాంక్స్" అని మాత్రం అనగలిగాను. ✱

